దూసుకుపోతున్న కార్గో రథచక్రాలు

- గ్రామీణ ప్రాంతాలకు ప్రారంభమైన పార్సిల్ సేవలు
- తక్కువ ధరకు, త్వరితగతిన పార్సిల్ డెలివరీ
- తెనాలి డిపోకు ఏడాదికి రూ.75 నుంచి 85 లక్షల ఆదాయం


తెనాలి డిపోలో ఏర్పాటు చేసిన కార్గో సేవల కౌంటర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్గో (పార్సిల్) సేవలు విస్తరిస్తున్నాయి. గతంలో పట్టణాలకే పరిమితమైన పార్సిల్ డెలివరీ నేడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది. అంతేకాకుండా ప్రవేట్ పార్సిల్ సేవల ధరల కంటే తక్కువ ధరకు పంపటంతో పాటు త్వరితగతిన వీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో ఎక్కువ మంది ఆర్టీసీ కార్గో సేవలు ఉపయోగించుకుంటున్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో వచ్చే నష్టాలను పూడ్చుకునేందుకు ప్రభుత్వం వీటి సేవలు విస్తరిస్తు వచ్చింది. దీనిలో భాగంగా కార్గో సేవలు, ఆర్టీసీ డిపో పరిధిలోని షాపులు, స్థలాలు లీజ్‌కు ఇవ్వటం వంటివి చేస్తున్నాయి. దీనిలో భాగంగా 2016లో తెనాలి ఆర్టీసీ డిపోలో కార్గో సేవలు ప్రారంభించారు. దీని కోసం బస్టాండ్ బయట ప్రత్యేక గదిని నిర్మించారు. పార్సిల్స్‌ను భద్రపరిచేందుకు మరో గదిని ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలు తీసుకు వచ్చిన పార్సిల్ వెయిట్ చూడటం... వాటికి బిల్లులు ఇచ్చేందుకు మొదట్లో గ్యాలక్సీ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు.

వారు పార్సిల్ తీసుకునేందుకు, డెలివరీ చేసేందుకు ఉద్యోగులను నియమించారు. అలాగే ఆన్‌లైన్‌లో వచ్చే ఇబ్బందులు తొలగించటం కూడా వారి బాధ్యతే. వారి కాలపరిమితి ముగియడంతో ప్రస్తుతం సింగ్ సొల్యూషన్స్ సంస్థతో ఒప్పందం చేసుకుని వారితో దీనిని నిర్వహిస్తున్నారు. కార్గో కౌంటర్ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10.30 వరకు పనిచేస్తుంది.

గ్రామీణ ప్రాంతాలకు విస్తరణ

తెనాలి డిపోలో 2016లో ప్రారంభమైన మొదట్లో తెనాలి పట్టణంలో పార్సిల్‌ను డెలివరీ చేసేవారు. గ్రామీణ ప్రాంతాలకు అయితే వారికి ఫోన్ చేసి డిపోకు వచ్చి పార్సిల్‌ను తీసుకుని వెళ్లమని చెప్పేవారు. తర్వాత ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుండటంతో డిపో పరిధిలోని 15 కిలో మీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు వీటిని డోర్ డెలివరీ చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని శివారు గ్రామాలకు కూడా దీని సేవలు విస్తరించారు. అలాగే హైద్రాబాద్, చెన్నై, బెంగుళూరు వంటి ప్రధాన నగరాలకు వీటిని డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

ఏడాదికి రూ.75 నుంచి 85 లక్షల ఆదాయం

తెనాలి డిపో పరిధిలోని కార్గో సేవల వలన గతంలో నెలకు సుమారు రూ.6 లక్షల వరకు ఆదాయం వచ్చేది. 2019 నుంచి 2021 వరకు కోవిడ్ కారణంగా కొంత ఆదాయం తగ్గింది. తర్వాత దాని సేవలు విస్తరిస్తు వస్తుండటంతో ప్రస్తుతం నెలకు రూ.7 నుంచి 7.50 లక్షల వరకు సమకూరుతోంది.


పార్సిల్ వెయిట్ చూస్తున్న సిబ్బంది

సంవత్సరం	ఆదాయం
2018-19	35,35,319
2019-20	46,84,561
2020-21	26,62,784
2021-22	49,73,280
2022-23	84,52,050
2023-24	75,70,128
2024 (ఏప్రిల్-సెప్టెంబర్)	37,10,612

'బస్సు చక్రం - ప్రగతికి చిహ్నం' ఇది ఏపీఎస్ ఆర్టీసీ లోగోలో ఉండే వాక్యాలు. అదే చక్రం ఇవాళ మరో అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. ఇన్నాళ్లు కేవలం ప్రయాణికులను మాత్రమే సురక్షితంగా చేరవేస్తూ అందరికీ దగ్గరైన ఆర్టీసీ ఇవాళ పార్సిళ్లను కూడా సకాలంలో రవాణా చేస్తూ లాభాలను గడిస్తోంది.

కార్గో సేవలు ఉపయోగించుకోండి



తెనాలి పట్టణం వ్యాపార కూడలి. ఇలాంటి ప్రాంతంలో వ్యాపారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కార్గో సేవలను ఆర్టీసీలో ప్రవేశపెట్టింది. నిషేధిత వస్తువులను మినహా మిగిలిన వాటిని ఇతర ప్రాంతాలకు పంపించడం జరుగుతుంది. దీనిలో భాగంగా వ్యాపారులను సహకరించాలని, ఇప్పటికే కోరడం జరిగింది. తక్కువ ధరకు పార్సిల్ సేవలను అందిస్తున్నాం. ప్రజలు, వ్యాపారులు కార్గో సేవలను ఉపయోగించుకోవాలి. వివరాలకు సెల్‌నెం.99519 91206 లో సంప్రదించాలి.

–ఎ.రాజశేఖర్, ఆర్టీసీ డిపో మేనేజర్, తెనాలి

క్లుప్తంగా

జీఆర్పీ పోలీసుల విధులపై అవగాహన



తెనాలిరూరల్: ప్రజల రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరాయంగా పనిచేసే పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి విధులను నిర్వహిస్తారు, అలాగే వెపన్స్ ఎందుకు వినియోగిస్తారు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కొన్ని అసాంఘిక శక్తులను అణిచివేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు వంటి అంశాలపై తెనాలి ప్రభుత్వ రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక మారిస్‌పేటలోని ఎన్‌సీఆర్‌ఎం హైస్కూల్ లో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థులు ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌కు గురువారం వెళ్లి అక్కడ వివరాలు తెలుసుకున్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా ఎస్‌ఐ జి. వెంకటాద్రి విద్యార్థులకు పోలీస్ విధుల గురించి వివరించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 21 నుంచి నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా రైల్వే జీఆర్పీ పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అనేక విషయాల గురించి తెలియజేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జీఆర్పీ పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

26 నుంచి తెనాలిలో తైక్వాండో పోటీలు



తెనాలిఅర్బన్: తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో కెఎస్‌ఆర్ తైక్వాండో అకాడమీ సహకారంతో ఈ నెల 26, 27 తేదీల్లో తెనాలిలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనునట్లు ఈగల్ రెస్టారెంట్ అధినేత ఈదర వెంకట పూర్ణచంద్, లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావులు తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లు, కరపత్రాలను గురువారం తెనాలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో సీనియర్స్, మిని సబ్ జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. తెనాలి బోసు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వెనుక ఉన్న లక్ష్మీనరసింహ సోమయాజీ వైశ్య వ్యాయామ మందిరంలో వీటిని నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్ అకాడమీ నిర్వాహకులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, కోచ్ రోహిత్ శర్మ, టి.చంటి, టి.బాలు, తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయం



భట్టిప్రోలు: అమర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్‌ఐ ఎం.శివయ్య పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో విద్యార్థులతో ఎస్‌ఐ, పోలీసులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివయ్య మాట్లాడుతూ భారత్–చైనా సరిహద్దుల్లోని అక్సారు చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డ కట్టే మంచు పర్వతాల మధ్యలో ఉండే హాట్స్ప్రింగ్ (వేడి నీటి బుగ్గ) వద్ద పనిచేయడం అమర జవాన్ల అకుంఠిత దీక్షకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే పోలీస్ అమరవీరుల దినోత్సవం ఈ పవిత్ర స్థలం నుంచే ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు మండల స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 49 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఆర్థిక సాయం

చెరుకుపల్లి: గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం ద్వారా రూ.లక్ష 80 వేలు ఆర్థిక సాయం ఇస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రెండు కోట్లకుపైగా ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సాయం అందించనుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని గత నెల 17న ఒడిశాలోని భువనేశ్వర్‌లో ప్రధాని ప్రారంభించారని తెలిపారు. ఈ పథకానికి లబ్ధిదారుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే యాప్‌ను ఏర్పాటు చేశారన్నారు. మండలంలోని 16గ్రామ పంచాయతీలలో ఆవాస్ సర్వేయర్లుగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వ్యవహరిస్తారని చెప్పారు.

కొల్లిపరలో నేడు విద్యుత్ కోత

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామ పంచాయితీలో గుదిబండివారిపాలెం, కొత్తపాలెం బీసీ కాలనీలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం నిలిపివేస్తున్నామని మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ కొల్లిపర గ్రామంలో చాలాచోట్ల లో ఓల్టేజ్ సమస్య ఉండటం వలన నూతన ట్రాన్స్ఫారంలో ఏర్పాటు చేయడం జరుగుతుంది. కావున విద్యుత్ నిలిపివేయటం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

లోపాలు ఉంటే తెలియజేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తినా వెంటనే తమకు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న స్థానికులను కోరారు. 7వ వార్డులో గురువారం పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఎక్కడ రోడ్లపై చెత్త లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఫాసిస్టు మూకలను తరిమి కొట్టండి

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్


సాయిబాబాకు నివాళులర్పిస్తున్న నేతలు

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు చాపకింద నీరులా వ్యాపించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, అందుకు అధికార మిత్ర పక్షాలైన టీడీపీ జనసేన పార్టీలు సహకరిస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్ అన్నారు. దేవాలయ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం ఉండకూడదని చంద్రబాబు తెచ్చిన జీవోనే ఇందుకు ఉదాహరణగా చెప్పారు. ప్రధాని మోడీ ఆజ్ఞలను కాదనలేని వారి నిస్సహాయత, బలహీనతలకు ఇదొక నిదర్శనమన్నారు. తెలుగు నేలపై మతోన్మాద రాజకీయాలు చేసే ఫాసిస్టు మూకలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

పట్టణంలోని చినరావూరు మున్సిపల్ కమ్యూనిటీ హాల్లో జరిగిన సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యకర్తల సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంపీ రామ్‌దేవ్ అధ్యక్షత వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎన్నో మగ్గుతూ ఉంటే అవన్నీ వదిలేసి తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని కాషాయీకరణ చేస్తూ టీడీపీ, జనసేనలు మత రాజకీయాలకు తెర లేపాయన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ వాగ్దానాలు చేసి ఇప్పుడు నోరు మెదపట్లేదన్నారు. ఈ పరిస్థితుల్లో 'పీపుల్స్–6' పేరుతో ప్రజలకు సంబంధించిన డిమాండ్లను మనమే లేవనెత్తి ప్రశ్నించాలని, ఆ దిశగా డిసెంబర్ 4న విజయవాడ లో తలపెట్టిన ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. 'పీపుల్స్ 6' డిమాండ్లను, బిహార్ జార్ఖండ్ మహారాష్ట్రలో పార్టీ విజయాలను, పెరుగుతున్న శక్తిని సభాధ్యక్షుడు ఎంపీ రామ్‌దేవ్ ప్రస్తావించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు ఉదయ్‌కిరణ్, కె.కోటేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థి యువజన సంఘం ఐసా–ఆర్‌వైఏ నాయకులు సుబ్బయ్య, బెన్‌హర్, వెంకటేష్, యూసఫ్, ఇనయతుల్లాతో సహా వివిధ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పించారు.

విషవృక్షాలతో భయం భయం

తొలగించాలని స్థానికుల వినతి


భారీగా పెరిగిన కోనోకార్పస్ వృక్షాలు

తెనాలి: పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ వృక్షాలను తొలగించాలని డీఎస్పీ కార్యాలయం వెనుక, పంటకాల్వకు పడమర వైపున గల అపార్టుమెంటు వాసులు అధికారులను కోరుతున్నారు. అక్కడి అయ్యప్పగుడి రోడ్డులోని కోనోకార్పస్ మొక్కలు భారీగా పెరిగాయని, 40 అడుగుల ఎత్తులో ఉన్న ఈ వృక్షాలతో పర్యావరణానికి హానికరమని తెలిపారు. విషవృక్షాలుగా జనం పిలుచుకునే ఈ వృక్షాలతో భూజలాలు తగ్గిపోతాయి..ఆ చెట్లపై కనీసం పక్షులు గూళ్లు కూడా పెట్టుకోవు...చెట్ల పువ్వుల నుండి వెలువడే పుప్పొడి కారణంగా మనుషుల్లో శ్వాసకోశ వ్యాధులు తలెత్తుతాయనే కారణంగా అనేకచోట్ల ఈ చెట్లను తొలగించారు. స్థానికుల వినతిపై పట్టణంలో కూడా ఈ చెట్లను ప్రధాన రహదారిలో పాక్షికంగానే తొలగించారు మినహా మిగిలిన ఏరియాల్లోని వాటిని పట్టించుకోలేదు. అయ్యప్పరోడ్డులో భారీగా పెరిగిన ఈ విష వృక్షాలను తొలగించాలని ఆ రోడ్డులో నివసిస్తున్న గ్రీన్ మినర్వా అపార్టుమెంటు సహా అక్కడి నివాసితులు విజ్ఞప్తి చేశారు.

మూగజీవాలతో వాహనదారులకు ఇక్కట్లు


చెరుకుపల్లిలో జాతీయ రహదారిపై వాహనాలకు అడ్డంగా తిష్టవేసిన మూగజీవాలు

చెరుకుపల్లి: రాత్రీపగలు తేడా లేకుండా వేల వాహనాలు రాకపోకలు కొనసాగుతూ రద్దీగా ఉండే 216 జాతీయ రహదారిపై అను నిత్యం మూగజీవాలు సంచారం చెరుకుపల్లి మండల కేంద్రంలో మరియు జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గ్రామాల్లో పరిపాటైంది. చెరుకుపల్లిలో జాతీయ రహదారిపై ఆవులు, గాడిదెలు, పందులు తిష్ట వేయటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఊరు బయట జాతీయ రహదారిపై అయితే అనునిత్యం ఎదో ప్రాంతంలో భారీ వాహనా కింద పడి మూగ జీవాలు ముత్యువాత పడుతున్నాయి. దీంతో కొన్ని చోట్ల ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురౌతున్నారు, ఇప్పటికైన గ్రామ పంచాయతీ అధికారులు జాతీయ రహదాపై మూగజీవాలను రోడ్లపై వదిలేస్తున్న యజమానులకు నోటీసులు జారీచేసి రోడ్లపైకి మూగజీవాలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని వాహదారులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ త్వరగా పూర్తిచేయాలి



రేపల్లె రూరల్: రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు గురువారం రేపల్లె రైల్వేస్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ వేదిక కన్వీనర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న రేపల్లె రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం వసతులను మెరుగుపరచాలని కోరారు. రేపల్లె నుంచి దూరప్రాంతాలకు రైల్వేసర్వీసులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక సభ్యులు కే.వెంకటేశ్వరరావు, నల్లూరి సాయికృష్ణమాచార్యులు, వెంకట మోహనరావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు


పెనుమూడి రాజ్యలక్ష్మి(ఫైల్)

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన పెనుమూడి రాజ్యలక్ష్మి ఈ నెల 20వ తేదీన తమ బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చింది. ఈ విషయమై భర్త బసవశంకర్ ఆమెను మందలించాడు. 21వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. త్రీ టౌన్ ఏఎస్‌ఐ హైదర్ అలీ గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వేమూరు: సైబర్ నేరాలతో అనేక మంది మోసపోతున్నారని ఎస్‌ఐ రవికృష్ణ చెప్పారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో సైబర్ నేరాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. సైబర్ నేరాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు.

■ సైబర్ నేరాల నియంత్రణ, యువత పాత్ర, పోలీసు విధులు అంశాలపై చుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఎస్‌ఐ సురేష్ పోటీలను పర్యవేక్షించారు.

ఉపాధి పనులపై గ్రామ సభ

ఫిరంగిపురం: మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కాగా దీనిపై గురువారం పంచయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ అనిల్ మాట్లాడుతూ ఫిరంగిపురంలో 307 వరకు వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాగా వీటిపై తనిఖీ చేసినట్లు తెలిపారు. చెరువు ప్రాంతంలో 160 మొక్కలకు గాను 130 మొక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అదే విధంగా పనులు నిర్వహించే ప్రాంతాల్లో నీడనిచ్చే టెంట్లు ఏర్పాటు చేయడం కాని, తాగునీరు అందించేలా చూడటం కాని లేవనే విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అత్యవసరంగా అవసరమయ్యే ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవన్నారు.

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి


ప్రయాణికులతో మాట్లాడుతున్న డాక్టర్ సాంబశివుడు

తెనాలిరూరల్: మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించాలంటూ తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న నాయకులు ప్రయాణీకులతో కలిసి బస్సులో ప్రయాణిస్తూ నిరసన తెలియజేశారు. డిపోలో తెనాలి నుండి గుంటూరు వెళ్లే బస్సు ఎక్కిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు, ఇతర నాయకులు పాత బస్టాండ్ వరకూ ప్రయాణించారు. అనంతరం డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు కొన్ని పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పేరుతో అన్నీ ఫ్రీ అంటూ హామీలు ఇచ్చారన్నారు. ఇందులో ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం హామీ ఉందని అది ఇంత వరకూ అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోందని చెప్పారు. కూటమి నాయకులు తక్షణమే ఈ ఉచిత ప్రయాణాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యన్నంశెట్టి శివ రామకృష్ణ ప్రసాద్, పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కర్లపూడి బుల్లెయ్య, పి.శివన్నారాయణ, పెనుగొండ శివకుమార్, వై. శంకర్‌రావు, పి. రాయప్ప, ఎస్. సుబ్బారావు, అయ్యప్ప, నామన మల్లికార్జున రావు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్ విడుదల


ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసిన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్. పక్కన మిలటరీ ప్రసాద్

తెనాలి: నిర్మాణంలో ఉన్న జగ్జీవన్‌రామ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గురువారం సచివాలయంలో విడుదల చేశారు. తెనాలిలోని మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (మా–ఏపీ) కార్యాలయంలో సాయంత్రం ఆ సినిమా దర్శకుడు దిలీప్‌రాజా వివరాలను వెల్లడించారు. వందేళ్ల క్రితం జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా చిత్రీకరించడానికి మరో ఆరునెలల సమయం పడుతుందని చెప్పారు. 2025లో విడుదల చేస్తామని తెలిపారు. ఎన్నారై డాక్టర్ చందోలు నాగమల్లేశ్వర రావు నిర్మిస్తున్న ఈ బయోపిక్ తదుపరి షెడ్యూల్ నవంబరు 9 నుంచి తెనాలిలో ఆరంభమవుతుందని చెప్పారు.. జలియన్ వాలాబాగ్‌లో భారతీయులను అతి కిరాతకంగా చంపిన జనరల్ డయ్యర్‌ను భారత వీరుడు సర్దార్ ఉద్దామ్‌సింగ్ కాల్చి చంపే సన్నివేశం, నాటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జన్సీ విధించడాన్ని విబేధిస్తూ జగ్జీవన్‌రామ్ తీసుకున్న నిర్ణయాలు ఈ షెడ్యూల్లో కీలకంగా ఉంటాయని వివరించారు..జగ్జీవన్ రామ్ పాత్రని పోషిస్తున్న మిలటరీ ప్రసాద్, ఇతర సినీ నటీనటులతో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా నటిస్తున్నారని అయన చెప్పారు. చందోలు దేవదాసు సమర్పణలో రూపొందుతున్న సినిమాకు కాలేబ్‌రాజు కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. నిర్మాత డాక్టర్ చందోలు నాగ మల్లేశ్వర రావు, కథ..మాటలు..స్క్రీన్ ప్లే దర్శకత్వం దిలీప్ రాజా.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


ట్రోఫీతో విద్యార్థిని బొర్రా గీతికశ్రీ

భట్టిప్రోలు: ఎస్‌జీఎఫ్‌ఏ ఆధ్వర్యంలో హిందూపూర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ జట్టులో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్‌కు చెందిన బొర్రా గీతికశ్రీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అలాగే ఉమ్మడి గుంటూరు బాలుర జట్టు ద్వితీయస్థానం సాధించింది. ఈ రెండు జట్లకు హైస్కూల్ పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావు కోచ్‌గా వ్యవహరించారు. వాలీబాల్ పోటీలలో ప్రతిభ చూపిన గీతికశ్రీ, నాగేశ్వరరావును హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షులు వేమూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు కూచిబొట్ల శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

హిందూ ధర్మం విశ్వజనీయం


ఎస్ఎస్ఎఫ్ గ్రామ కన్వీనర్ల ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న యల్లాప్రగడ

చెరుకుపల్లి: హిందూ ధర్మం విశ్వజనీయమని, అది ప్రపంచ శాంతిని కోరుకుంటుందని సమర సత సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా సమన్వయ బాల వికాస్ ప్రముఖ్ యల్లాప్రగడ సీతాపతి పేర్కొన్నారు. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం రేపల్లె, నగరం, భట్టిప్రోలు, చెరుకుపల్లి మండలాల ఎస్ఎస్ఎఫ్ గ్రామ కన్వీనర్ల ఒక్క రోజు శిక్షణ తరగతులు జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, బొలగాని విజయ లక్ష్మీ, వెంకటేశ్వర్లు, పడమట వెంకటేశ్వరరావు, విస్సంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com